క్లుప్తంగా

పీహెచ్‌సీని పరిశీలించిన ఆర్డీఓ



రాయవరంలో ఎస్సీ బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సుధాసాగర్

రాయవరం: శిథిల స్థితిలో ఉన్న రాయవరం పీహెచ్‌సీని రామచంద్రపురం ఆర్డీఓ సుధాసాగర్ గురువారం పరిశీలించారు. కొద్దిపాటి వర్షానికే పీహెచ్‌సీ భవనం శ్లాబ్ నుంచి వర్షపు నీరు లీకేజీ అవ్వడంతో పాటు, ఒక్కోసారి తడిసిన గోడలకు విద్యుత్ ప్రసారం అవుతోంది. ఈ పరిస్థితిపై పీహెచ్‌సీ వైద్యాధికారి వి.అనిరుధ్ ఉన్నతాధికారులకు తెలియపర్చడంతో ఆర్డీఓ సుధాసాగర్ పీహెచ్‌సీని స్వయంగా పరిశీలించారు. పీహెచ్‌సీకి రోగుల తాకిడి కూడా అధికంగా ఉంటున్నట్టు వైద్యాధికారి అనిరుధ్ ఆర్డీఓకు వివరించారు. శిథిలస్థితిలో ఉన్న పీహెచ్‌సీని నిరుపయోగంగా ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్ భవనంలోకి తరలించేందుకు ఉన్న అవకాశాన్ని పరిశీలించారు. హాస్టల్ భవనాన్ని ఆర్డీఓ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయా పరిస్థితులపై సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందజేసిన అనంతరం, తదుపరి చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ విలేకరులకు తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ పంపన రామారావు, లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు, స్థానిక నేతలు ఉన్నారు.

ఎడతెరిపి లేని వర్షం



భారీ వర్షంతో మునిగిపోయిన హౌసింగ్ బోర్డులోని రోడ్లు

రామచంద్రపురం: తెల్లవారుజాము నుంచి ఎడతెరిపిలేని వర్షం కురవటంతో గురువారం రామచంద్రపురం పట్టణంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 8 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని హౌసింగ్ బోర్డులోని రోడ్లన్నీ మునిగిపోయాయి. వర్షపునీటితో డ్రైనేజీలు పొంగిపోయి, రోడ్లమీదకు నీటి ప్రవాహం వచ్చి చేరుకుంది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, విధులకు హాజరయ్యే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. భారీ వర్షం కురవటంతో పట్టణంలోని కోర్టుల ప్రాంగణం అంతా నీటితో మునిగిపోవటంతో కక్షిదారులు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షం కారణంగా ఉదయం 9 గంటల వరకు జనజీవనం స్తంభించి పోయింది.


క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న సభ్యులు

మండపేట: ప్రతి ఒక్కరూ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండపేటలో గురువారం క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ చేపట్టారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, చైర్‌పర్సన్ దుర్గారాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ర్యాలీని తోరాటి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అత్యంత ప్రమాదకర వ్యాధుల్లో క్యాన్సర్ ఉందన్నారు. కరపత్రాలు, వాల్‌పోస్టర్‌ను చైర్‌పర్సన్ దుర్గారాణి ఆవిష్కరించారు. దుర్గారాణి మాట్లాడుతూ మహిళలు ఈ వ్యాధి బారిన పడకుండా, ముందస్తు పరీక్షలు చేయించుకుంటే మంచిదన్నారు. క్యాన్సర్‌కు కారణమైన ప్లాస్టిక్ వాడకాన్ని విరమించుకోవాలని సూచించారు. సంఘ ప్రతినిధులు గంగుమళ్ల రాంబాబు, సూరంపూడి వీరభద్రరావు, మట్టా వీరబాబు, ఇరవాడ రవి, వానపల్లి కనకరాజు, పెదపాటి విష్ణు, పీఎంపీలు పాల్గొన్నారు.

హసన్‌బాదలో తల్లిపాల వారోత్సవాలు



బాలింతలకు బాల సంజీవని కిట్లు అందజేస్తున్న సర్పంచ్ సతీష్‌రావు

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు చేతుల మీదుగా బాలింతలు బాల సంజీవని కిట్లను అందజేశారు. తల్లి పాల ప్రాముఖ్యత, చంటి బిడ్డలకు తల్లి పాలు ఇవ్వాల్సిన ఆవశ్యకతల గురించి వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్‌లో నూతనంగా ఎన్నికైన పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ జానా మల్లిబాబు, వైస్ చైర్మన్ కర్రి వీరసత్యవేణి, కమిటీ సభ్యులు మద్దింశెట్టి శ్రీమన్నారాయణమూర్తి, గొల్లపల్లి వీరన్న, రావుల రాజు, అంగన్‌వాడీ టీచర్స్ ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుక్కలున్నాయ్.. పిక్కలు జాగ్రత్త

- బెంబేలెత్తుతున్న జనం
- గుంపులుగా మీద పడుతున్న పరిస్థితి
- పట్టించుకోని అధికార యంత్రాంగం



పామర్రులో రోడ్డుపై గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

కె.గంగవరం: సాయంత్రమైతే చాలు రోడ్డెక్కుతాయి. పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంత పల్లెల వరకు శునకాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. శస్త్ర చికిత్సలతో శునకాల సంతతి తగ్గించాలని ప్రభుత్వం ఆదేశించింది. పట్టణంలోని మున్సిపాలిటీతో పాటు గ్రామ పంచాయతీల వరకు నిధులు ఉన్నా శునకాల నియంత్రణ కాగితాలకే పరిమితమైంది. రామచంద్రపురం పట్టణంతో పాటు కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం రూరల్, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లోని గ్రామాల్లో కుక్కల బీభత్సం సృష్టిస్తున్నాయి. రోజున సగటు ఒకరిద్దరు కుక్కగాటుకు గురవుతున్నాయి. వాహన చోదకులు కుక్కల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలవుతున్న సంఘటనలు కనిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్న శునకాల నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించడంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కె.గంగవరం మండలంలో 2000, కాజులూరు మండలంలో 2300, రామచంద్రపురం రూరల్ 1800, మండపేట నియోజకవర్గంలో సుమారుగా 6740 వరకు కుక్కలు ఉన్నట్లు అంచనా. గ్రామాల్లోని మాంసం విక్రయ కేంద్రాల వద్ద వ్యర్థపదార్థాలు తింటూ మనుషులు, పశువులపై దాడులు చేస్తున్నాయని స్థానికులు అంటున్నారు.

నిత్యం 20కి పైగా కుక్కకాట్లు

రామచంద్రపురం నియోజకవర్గంలోని పట్టణంతో పాటు మూడు మండలాల్లో, మండపేట నియోజకవర్గంలోని మూడు మండలాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రతి రోజు కుక్కకాటు బాధితులు వస్తుంటారని ఆయా పీహెచ్‌సీల వైద్యులు చెబుతున్నారు. కుక్క కరిచిన వారికి టీటీ ఇంజక్షన్‌తో పాటు యాంటీ రేబిస్ వ్యాక్సిన్(ఏఆర్‌వీ) నాలుగు డోస్‌లను 28 రోజుల వ్యవధిలో వేస్తారు. కుక్కకాటు తీవ్రత ఎక్కువగా ఉన్న వారికి ఇమ్యునోగ్లోబులిన్స్ అనే ఇంజక్షన్‌ను కూడా అదనంగా చేస్తున్నారు. తల భాగానికి దగ్గరగా కుక్కకాటు పడిన వారికి అపాయం ఎక్కువగా ఉంటుందని, కుక్కకాటు బాధితుల మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్యులు చెబుతున్నారు.

ప్రథమ చికిత్స ఇలా..

కుక్కకాటుకు గురైతే గాయాన్ని సబ్బుతో, నీటితో బాగా కడగాలి. గాయాల్ని కప్పకూడదు, దగ్గర్లోని డాక్టర్‌ని సంప్రదించాలి. ర్యాబిస్ వ్యాధితో చనిపోయిన జంతువులను కాల్చడం లేదా సున్నపు గుంటలో పూడ్చడం చేయాలి. కుక్క ఉండే పరిసరాలు, అవి తిరిగే ప్రదేశాలు, పాత్రలను క్రిమిసంహారక మందులతో తరుచూ శుభ్రపరుచుకోవాలి. ఈ వ్యాధికి చికిత్స లేదు. పెంపుడు కుక్కలను పశు వైద్యుడితో ర్యాబిస్ టీకా వేయించాలి. ఊరకుక్కలకు కూడా ఈ వ్యాధి రాకుండా పంచాయతీల సహాయంతో టీకాలు వేయించాలి.

ర్యాబిస్ కుక్కల లక్షణాలివి..

ర్యాబిస్ లక్షణాలున్న కుక్కల నోటి నుంచి చొంగ కారుతుంది. నాలుక బయటపెట్టి మతిలేకుండా తిరుగుతాయి. కనిపించిన వారిని, పశువులను, ఇతర కుక్కలను కరుస్తాయి. అరుపులో మార్పు వస్తుంది. ఇవి 7 నుంచి 10 రోజుల్లో చనిపోతాయి. ఈ జబ్బు వచ్చిన మరికొన్ని కుక్కలు తినకపోవడం, నిశ్చలంగా ఒకచోటే పడుకుని అలాగే ఉండిపోతాయి, పక్షవాతం రావడం తదితర లక్షణాలతో రెండు మూడు రోజుల్లో చనిపోతాయి. దీన్ని మూగ రేబిస్ అంటారు. ర్యాబిస్ కుక్క కరిస్తే వ్యాధి నిరోధిక టీకాలు వేయించడం తప్పనిసరి.

దినదిన గండం



గుంపులు గుంపులుగా కుక్కలు వీధుల్లో స్వైర విహారం చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఎప్పుడు ఏ వైపు నుంచి వచ్చి ఎవరి మీద దాడి చేస్తాయో తెలియడం లేదు. ఇది వరకే ఎంతో మందిపై దాడి చేసి గాయపరిచాయి. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించడం లేదు.

– రాయుడు జగన్, నల్లచెరువు పుంత

ప్రత్యేక నిధులు లేవు



కుక్కలను పట్టేందుకు పంచాయతీలకు ప్రత్యేక నిధులు లేవు. వాటిని సంహరించే అధికారం లేదు. పిచ్చికుక్కలను గ్రామస్తులే సంహరిస్తున్నారు. కుక్కలు ఎక్కువగా మాంసం విక్రయ కేంద్రాల వద్దే సంచరిస్తున్నాయి. మాంసం వ్యర్థాలను ఊరికి దూరంగా పాడేయాలని వారికి సూచించాం. వీధి కుక్కలకు కుటుంబ నియంత్ర శస్త్ర చికిత్సలో కోసం పశువైద్యులను సంప్రదించాం. త్వరలో గ్రామ సర్పంచ్‌ల సహకారంతో వాటిని చికిత్స చేస్తాం.

– ఎస్.శ్రీనివాసరావు, ఎంపీడీఓ, కె.గంగవరం

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రామచంద్రపురం: ఏపీ ట్రాన్స్‌కో ప్రధానమైన 132 కేవీ కాకినాడ–రామచంద్రాపురం లైన్‌ను మార్పులు చేయటంతో ముమ్మిడివరం, కొత్తపేట, అమలాపురం, రాజోలు మరియు చుట్టుపక్కల ఏరియాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 3 గంటల మధ్యలో అప్పుడప్పుడూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని కాకినాడ ఏపీ ట్రాన్స్‌కో ఈఈ ఖాజా రహంతుల్లా, రామచంద్రపురం ఆపరేషన్ ఈఈ వై.విజయానంద్, అమలాపురం ఆపరేషన్ ఈఈ రవి కుమార్‌లు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మండపేట: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం ఈఈ వై.విజయానంద్, డీఈఈ సీహెచ్ శ్రీధర్ గురువారం మీడియాకు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం వరకూ ఏడిద రోడ్డు, బైపాస్ రోడ్డు, సంఘం కాలనీ, సత్యశ్రీ రోడ్డు, మెయిన్ రోడ్డు, తర్వాణిపేట, పోలీస్ స్టేషన్ రోడ్డు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వీధి, వీరభద్రపురం, విజయలక్ష్మినగర్, బ్యాంక్ కాలనీ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని వివరించారు.

10న పెన్షనర్ల సంఘ సమావేశం

కపిలేశ్వరపురం: రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సాధారణ సమావేశం ఈ నెల 10న మండపేట పట్టణంలో నిర్వహించనున్నట్టు కపిలేశ్వరపురం మండలం వల్లూరుకు చెందిన సంఘ అధ్యక్షుడు దేవళ్ల సత్యనారాయణ గురువారం తెలిపారు. మండపేట పట్టణంలోని శ్రీరమా హిందూ మున్సిపల్ యూపీ స్కూల్‌లో మధ్యాహ్న 3 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగుల డీఆర్, ఎరియర్స్, ఇన్‌కంటాక్స్ తదితర సమస్యలపై చర్చించనున్నట్టు చెప్పారు.

18న శెట్టిబలిజ నూతన కార్యవర్గం ఎంపిక

రామచంద్రపురం: ఈ నెల 18న రామచంద్రపురం నియోజకవర్గం తాలూకా శెట్టిబలిజ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక సంఘ అధ్యక్షుడు కట్టా సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు సంఘ కార్యదర్శి వాసంశెట్టి లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18న ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న సంఘ సాధారణ సర్వ సభ్యుల సమావేశానికి రాజ్యసభ సభ్యులు, సంఘ గౌరవాధ్యక్షుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి సంఘ పెద్దలు, సభ్యులు, శెట్టిబలిజ సామాజిక వర్గ ప్రజాప్రతినిధులు పాల్గొని తాలూకా శెట్టిబలిజ సంఘం రిజిస్టర్డ్ బాడీ నూతన కార్యవర్గ ఎన్నికకు సహకరించాల్సిందిగా కోరారు.

విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

కాజులూరు: విషజ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య అన్నారు. గురువారం గొల్లపాలెం పీహెచ్‌సీ పరిధిలోని పలు సచివాలయాల్లో ఆరోగ్యశాఖ సిబ్బంది పర్యటించి స్థానికులకు జ్వరపరీక్షలు నిర్వహించారు. ఆర్యావటంలో డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ చెదురుమదురు వర్షాల కారణంగా గ్రామాల్లో పలువురు జ్వరాల బారిన పడుతున్నారన్నారు. డెంగీ వంటి జ్వరాలు సోకినా తగిన చికిత్స అందించేందుకు ప్రభుత్వం వైద్యారోగ్యశాఖను అప్రమత్తంగా ఉంచిందని గ్రామాల్లో ఎవరికైనా రోజుల తరబడి జ్వరం లక్షణాలు కనిపించినా వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. పీహెచ్‌సీ సిబ్బంది నరాల రాజారావు, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా సాగులో అధిక దిగుబడులు సాధ్యం



గొల్లపాలెంలో ఆక్వా రైతుల అవగాహన సదస్సులో సూచనలిస్తున్న డీఎస్ఎన్ మూర్తి

కాజులూరు: అవగాహనతో వ్యవహరించినప్పుడే ఆక్వా సాగులో రైతులు అధిక దిగుబడులు సాధించగలుగుతారని అవంతి ఆక్వాఫీడ్ రీజినల్ మెనేజర్ డీఎస్ఎన్ మూర్తి అన్నారు. గొల్లపాలెంలో గురువారం రాత్రి ఆక్వా టెక్నీషియన్ కొల్లు కన్నం నాయుడు ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో అవంతి ఆక్వాఫీడ్ రీజినల్ మేనేజర్ డీఎస్ఎస్ మూర్తి, ఏరియా మెనేజర్ సాంబశివయ్య, పలువురు సీనియర్ ఆక్వా టెక్నీషియన్లు పాల్గొని రైతులకు ఈహెచ్‌సీ తదితర వ్యాధుల చికిత్స, చెరువుల నిర్వహణపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మేతల నిర్వహణపై రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని అవసరాన్ని మించి మేతలు వినియోగించటం వలన అధిక వ్యయాలకు గురికావటమే కాకుండా చెరువుల్లో బ్యాక్టీరియా లోడ్ పెరిగి తదుపరి పంటలో రొయ్యల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. రైతులు ఎప్పటికప్పుడు టెక్నీషియన్ల సూచనలు పాటిస్తూ రొయ్యల సాగులో మంచి దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక డీలర్లు తాడి మాచారెడ్డి, చిన్నం సత్యానందరెడ్డి, కరప, కాజులూరు, తాళ్లరేవు తదితర మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

పోస్టాఫీసులో సినీ దర్శకుడి సందడి



వంశీని సత్కరిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

మండపేట: కోకిల, లేడీస్ టైలర్, ఔను వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు. అన్వేషణ, ఏప్రిల్ 1 విడుదల వంటి ఉత్తమ చిత్రాలను అందించిన దర్శకుడు వంశీ మండపేట పోస్టాఫీసులో సందడి చేశారు. గురువారం ఓ ప్రైవేటు కార్యక్రమానికి మండపేట వచ్చిన ఆయన పోస్టాఫీసుకు రావడంతో, పోస్టల్ సిబ్బంది ఆయనను ఆహ్వానించారు. ఈ సందర్భంగా వంశీ పోస్ట్‌మాస్టర్ ఎంవీ సుబ్బారెడ్డి, ఉద్యోగులు కేవీ నారాయణరావు, కొండపల్లి సూర్యనారాయణ, సిబ్బందితో తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యాలయం ద్వారా సేకరించిన పోస్టు కార్డులు, ఇన్‌ల్యాండ్ లెటర్లు తాను మంచి కథలు రాయడానికి స్ఫూర్తినిచ్చాయని వంశీ వివరించారు. కాలేజీ రోజుల్లో రాసిన ప్రేమలేఖలు సినిమా సంభాషణలకు అంకురార్పణ కలిగించాయన్నారు. పోస్టాఫీసు అంటే తనకెంతో గౌరవమని పోస్టల్ సేవలు దేశంలోనే విశిష్ట స్థానంలో ఉన్నాయని కితాబునిచ్చారు. అనంతరం ఉద్యోగులు ఆయనను ఘనంగా సత్కరించారు. సాయిదత్తా ఆటో కన్సల్టెన్సీ సుందరపల్లి వెంకటరత్నం, ఉద్యోగులు శివయ్య, ప్రవీణ్ శంకర్, ఎండీఎం షరీఫ్, కే వెంకట్రావు, సీహెచ్ శ్రీనివాస్, సీహెచ్ దుర్గాదేవి ఆయనకు అభినందనలు తెలిపారు.

తెలుగు భాషా సంబరాల పోస్టర్ల ఆవిష్కరణ



తెలుగు భాషా సంబరాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్: అమలాపురంలో ఈ నెల 18న జరిగే తెలుగు భాషా దినోత్సవ సంబరాలు, జాతీయ శతాధిక కవి సమ్మేళనం పోస్టర్లను కలెక్టర్ రావిలాల మహేష్‌కుమార్ ఆవిష్కరించారు. శ్రీశ్రీ కళా వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం రాత్రి కలెక్టరేట్‌లో జరిగింది. తెలుగు సంబరాలు, శతాధిక కవి సమ్మేళానికి ముఖ్య అతిథిగా రావాలని కలెక్టర్ మహేష్‌కుమార్‌కు శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలార్జున సత్యనారాయణ మాకే, జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, జిల్లా కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ ఆహ్వాన పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో కుంపట్ల సుభాషిణి, జల్లి సుజాత, కవులు పోలమూరి వెంకట్, కడలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైశ్య సంఘం అధ్యక్షుడిగా సత్యనారాయణమూర్తి



వాసవీ మాత సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేస్తున్న పట్టణ వైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణ వాసవీ కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘానికి నూతన అధ్యక్షుడిగా నంబూరి సత్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా నంబూరి నరేష్, కోశాధికారిగా కొమ్మూరి వెంకటాచలప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో నూతన కార్యవర్గ ప్రతినిధులు గురువారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వాసవీ మాత ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నూతన కార్యవర్గ ప్రతినిధులను బులియన్ మార్కెట్ అసోసియేషన్ ప్రతినిధులు మేడిచర్ల త్రిమూర్తులు, బోణం సత్య వరప్రసాద్, మద్దింశెట్టి ప్రసాద్ తదితరులు సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ పట్టణ ఆర్య వైశ్యుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. సంఘం ద్వారా సేవ, ఆధ్యాత్మిక, విజ్ఞాన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పట్టణ వైశ్య ప్రముఖులు వంకాయల కాశీ, యెందూరి నాగేశ్వరరావు, వరదా సూరిబాబు, నందిపాటి శ్రీనివాస్, యర్రమిల్లి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు



కేశవరం నూతన కమిటీ సభ్యులతో వైఎస్సార్ సీపీ నాయకులు

68 పాఠశాలలకు చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక

మండపేట: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ)ల ఎన్నికలు మండలం, పట్టణంలో గురువారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ హైస్కూళ్లు 69 ఉండగా, 68 స్కూళ్లకు ఎన్నికలు పూర్తయ్యాయని ఎంఈఓ నాయుడు రామచంద్రరావు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. 144 సెక్షన్ అమలు చేశారు. విద్యార్థుల తల్లి దండ్రులతో కొన్నిచోట్ల ఏకగ్రీవం కాగా, మరికొన్ని చోట్ల ఎన్నికలు జరిగాయి. కేశవరం జెడ్పీ పాఠశాలను ఆర్డీఓ, డీవైఈఓలు పరిశీలించారు. కాగా వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థులు విజయం సాధించారు. స్కూల్ కమిటీ చైర్మన్ వైరాల రాజు, వైస్ చైర్మన్‌గా కొల్లి సోని గెలుపొందారు. కార్యవర్గ సభ్యులుగా చుక్క దేవి, చక్కా ఏసమ్మ, కిన్నెర రత్నకుమారి, దున్నే మునేశ్‌కుమార్, పెందుర్తి శ్రీదేవి, కడగల వరలక్ష్మిలు ఎన్నిక కాగా, కో–ఆప్షన్ సభ్యులుగా కొప్పిరెడ్డి వెంకట శివప్రసాద్, అద్దంకి రమణ నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణమూర్తి , ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ వారి గెలుపునకు కృషి చేశారు. నూతన కమిటీ సభ్యులను ఎంపీటీసీ సభ్యులు అన్నందేవుల కృష్ణ, చంద్రమళ్ల పోతురాజు, మాజీ ఎంపీటీసీ అన్నందేవుల చంద్రరావు, తుపాకుల ప్రసన్నకుమార్, సొసైటీ మాజీ అధ్యక్షుడు ముక్కపాటి శ్రీను తదితరులు అభినందించారు. ఎంపీడీఓ శ్రీదేవి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ అశోక్, ఈఓపీఆర్డీ ఐదం రాజు ఎన్నికలను పర్యవేక్షించారు.

రాయవరంలో..

రాయవరం: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో 33 ప్రాథమిక, ఐదు ప్రాథమికోన్నత, ఎనిమిది ఉన్నత పాఠశాలలకు ఎన్నికలు నిర్వహించారు. మండలంలో 18 ప్రాథమిక, ఒక ప్రాథమికోన్నత, ఆరు ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించగా, 15 ప్రాథమిక, నాలుగు ప్రాథమికోన్నత, రెండు ఉన్నత పాఠశాలల్లో ఏకగ్రీవమయ్యాయి. మండలంలో 359 మంది ప్రాథమిక పాఠశాలలకు, 84 మంది ప్రాథమికోన్నత, 157 మంది ఉన్నత పాఠశాలల్లో ఎస్ఎంసీ సభ్యులుగా ఎన్నికయ్యారు. తరగతికి ముగ్గురు వంతున సభ్యులను ఎన్నుకున్నారు. మధ్యాహ్నం 1.30కు ఎన్నికైన కమిటీ సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం తొలి ఎస్ఎంసీ సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాలల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఎస్.రామారావు, సీఆర్పీలు కె.నీనాసిరి, వాసంశెట్టి సీతాధనలక్ష్మి, కిలపర్తి పోసిరాములు, వై.లక్ష్మీవీర్రాజు ఎన్నికలను పర్యవేక్షించారు.

చైర్మన్‌కు సర్పంచ్ అభినందనలు

సోమేశ్వరం జెడ్పీ హైస్కూల్ ఎస్ఎంసీ ఎన్నికల్లో చైర్మన్‌గా ఎన్నికైన జోడా గణేష్‌ను సర్పంచ్ ఆరిఫ్ గురువారం అభినందించారు. పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గణేష్‌ను పూలమాల, దుశ్శాలువాతో అభినందించారు. కమిటీ సభ్యుడు వినకోటి ప్రకాష్, కో–ఆప్షన్ సభ్యుడు శాకా ఫణిశంకర్‌ను కూడా సర్పంచ్ అభినందించారు. సొసైటీ త్రిసభ్య కమిటీ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

51 స్కూళ్లలో ఎన్నికలు

కపిలేశ్వరపురం: మండలంలోని 51 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. ఎంపీడీఓ పర్యవేక్షణలో ఎంఈఓ కె.తాతారావు ఆధ్వర్యంలోని అధికారులు ఎన్నికల ప్రక్రియను చేపట్టారు. 37 ప్రాథమిక, ఆరు ప్రాథమికోన్నత, ఎనిమిది ఉన్నత పాఠశాలలకు చైర్‌పర్సన్ వైస్ చైర్‌పర్సన్, కో ఆప్షన్ సభ్యులు, సభ్యులను ఎన్నుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు, వీఆర్వోలు, కార్యదర్శులు, పోలీస్ అధికారులు పర్యవేక్షించారు.

కొలువుదీరిన నూతన కమిటీలు

కె.గంగవరం: మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని పది ఉన్నత పాఠశాలల్లో దంగేరు, కుందూరు పాఠశాలల్లో ఎలక్షన్ నిర్వహించగా మిగిలిన 8 ఉన్నత పాఠశాలల్లో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సత్యవాడ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా సలాది వెంకటేశ్వరరావు, పామర్రు హైస్కూల్ చైర్మన్‌గా ఎలుగుబంటి శ్రీనివాసరావు, కోటిపల్లిలో యండమూరి అనిత, కూళ్లలో కర్రి నాగమణి, కుందూరులో పెద్దిరెడ్డి వెంకట సత్యనారాయణ, శివలలో ఇళ్ల లక్ష్మీదేవి, అద్దంపల్లిలో బీరా ఝాన్సీరాణి, దంగేరులో మల్లిపూడి సూర్యభవాని, కె.గంగవరంలో పెంటపాటి శివన్నారాయణ, సుందరపల్లిలో వి.నాగబాబులను ఎన్నుకున్నారు. ఆయా పాఠశాల హెచ్‌ఎంలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం పట్టణం, రామచంద్రపురం రూరల్ గ్రామాల్లోని 86 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 16 హైస్కూల్స్, మిగిలిన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎన్నికలు పూర్తై చైర్మన్, వైస్ చైర్మన్, కోఆప్షన్ సభ్యులతో పాటు సభ్యులను ఎంపిక చేసుకోవడం జరిగిందన్నారు.

పాఠశాల యాజమాన్య కమిటీల ప్రమాణ స్వీకారం

రామచంద్రపురం/రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం పట్టణంలోని చింతపల్లి సూరన్ననగర్‌లో ఇందిరా గాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్‌గా గుబ్బల విజయలక్ష్మి, వైస్ చైర్మన్‌గా మడికి బాబూరావులు పాఠశాల హెచ్‌ఎం మల్లాడి మాధవ్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. రూరల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో చైర్మన్‌గా పచ్చిమాల శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా పోతుల వెంకటలక్ష్మి ప్రిన్సిపాల్ ఎన్‌వీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. వెల్ల జెడ్పీ హైస్కూల్‌లో సుంకర ఆదినారాయణ, పందిరి శాంతకుమారిలు పాఠశాల హెచ్‌ఎం బి.వీరభద్రరావు ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో చైర్మన్‌గా జానా మల్లిబాబు, వైస్ చైర్మన్‌గా కర్రి వీరసత్యవేణిలు హెచ్‌ఎం పీఎస్‌బీఎస్‌కే సుందరి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. కాపవరంలో జెడ్పీ హైస్కూల్‌కు హెచ్‌ఎం ముమ్మిడి సత్యనారాయణ ఆధ్వర్యంలో చైర్మన్‌గా గీసాల వీరవెంకటరామ్‌ప్రసాద్, వైస్ చైర్మన్‌గా జనపల్లి వేణు, ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా పినిపే ఉమ, వైస్ చైర్మన్ పల్లేటి సూరిబాబు ప్రమాణ స్వీకారం చేయగా గ్రామ సర్పంచ్ యనమదల మంగాదేవి, ఎంపీటీసీ రెడ్నం సతీష్‌లు అభినందించారు. తాళ్లపొలంలో ప్రాథమికోన్నత పాఠశాల చైర్మన్‌గా మేడిశెట్టి వీరవెంకటరమణ, వైస్ చైర్మన్‌గా సిగిరెడ్డి వరలక్ష్మిలను గ్రామ సర్పంచ్ కట్టా గోవిందు, ఉప సర్పంచ్ వల్లు శివ, ఎంపీటీసీ పంపన ఏడుకొండలు అభినందించారు. వెంకటాయపాలెంలో జెడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా దడాల రాజేశ్వరి, వైస్ చైర్మన్‌గా టేకుమూడి రామాంజనేయులు ఎంపిక కాగా సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్‌లు అభినందించారు. ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా కోన నాగజ్యోతి, వైస్ చైర్మన్‌గా పెయ్యల మాణిక్యాంబలు ఎంపికయ్యారు.



కె.గంగవరం ఉన్నత పాఠశాలలో చేతులెత్తి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు



సోమేశ్వరం ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులను సత్కరిస్తున్న సర్పంచ్ ఆరిఫ్